


జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్‌లు

కర్నూలు(లీగల్), జూన్ 13: సుప్రీం కోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఆయా కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్‌లను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ప్రి లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాజీకి సమ్మతించిన కక్షిదారులు జిల్లాలోని ఆయా కోర్టులలో ఉన్న లోక్ అదాలత్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.





మెగా డీఎస్సీపై హర్షం

- డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు
- ఉమ్మడి జిల్లాలో 2,500కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- నిరుద్యోగుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13:

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీని ప్రకటించడం పట్ల నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయనుంది. స్కూల్ అసిస్టెంట్లు 7,725, ఎస్‌జీటీలు 6,371, టీజీటీ 1781, పీజీటీ 286, ప్రిన్సిపల్స్ 52, పీఈటీ 132 పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,500కు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీని ప్రకటించలేదు. నిరుద్యోగ ఉపాధ్యాయులు ఉద్యోగాలపై ఆశలు వదులుకున్నారు. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీపై తొలి సంతకం చేయటం ఆనందంగా ఉంది. గత ఐదేళ్ల డీఎస్సీ కోసం కళ్ల కాయలు కాసేలా ఎదురు చూశాం. జగన్ ఒక్క డీఎస్సీ వేయకుండా ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ అంటు పోస్టులు లేకుండా విడుదల చేసి మా ఆశలపై నీళ్ల చల్లారు. ఐదేళ్ల కోచింగ్ తీసుకొని ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డాం. అయితే చంద్రబాబు మా బాధలను ఆలకించి మాకు ఇచ్చిన మాట మేరకు డీఎస్సీ విడుదలకు సంతకం చేయటం హర్షణీయం.

- బీ కేశమ్మ, డీఎస్సీ అభ్యర్థి, ఎమ్మిగనూరు



మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు



2019లో అధికారంలోకి వచ్చిన జగన్ డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి మాట ఇచ్చి తప్పారు. డీఎస్సీ అభ్యర్థులను మోసం చేశారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తు వచ్చాం. ఇన్నేళ్లకు మా కలను చంద్రబాబు నెరవేర్చాడు. ఎన్నికలకు ముందు మాకు ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ విడుదల కోసం పెట్టడం హర్షణీయం. ఆయనకు కృతజ్ఞతలు

- మురళి, ఎమ్మిగనూరు.

జగన్ పాలనలో పాఠశాల విద్య పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కి.మీల దూరంలో ఉన్న అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 330కి పైగా పాఠశాలలు మూతపడ్డాయి. ఫలితంగా ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. పాఠశాలల విలీనంతో నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న పాఠశాలలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపలేక ఆర్థిక భారమైనా దగ్గరలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. దీంతో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య గణనీయంగా తగ్గింది. రేషనలైజేషన్ చేపట్టక ముందు జిల్లాలో మూడువేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు అవసరం ఉండేది. అయితే.. వైసీపీ ప్రభుత్వం విలీనం పేరుతో ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను తగ్గించింది. ఫలితంగా ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడింది. గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలల కిందట డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1541 పోస్టులు ఖాళీలు చూపించింది. డీఎస్సీకి సంబంధించిన టెట్ కూడా పూర్తి చేసింది. అయితే.. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా పరాజయం పొందింది. కొత్త ప్రభుత్వం భారీగా టీచర్ల ఖాళీలతో డీఎస్సీ ప్రకటించడంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన డీఎస్సీ హామీపై మొదటి సంతకం పెట్టడం పట్ల పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించినట్లంది. ఎంతో కాలం నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో నిరుద్యోగ ఉపాధ్యాయులు టీచరు ఉద్యోగాలపై ఆశలు వదులుకుని ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. మరికొంత మంది ఎప్పటికైనా డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోతుందా అని వేలకు వేలు ఫీజులు చెల్లించి దీర్ఘకాలంగా కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఈసారి ఎలాగైనా కష్టపడి ఉద్యోగాన్ని సంపాదించాలనే కసితో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల జిల్లాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధ్యాయ నియామకాల భర్తీకి సంబంధించిన ప్రక్రియను శరవేగంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న కల నెరవేరబోతోంది. త్వరలో ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

మాట నిలబెట్టుకున్నారు



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఐదేళ్ళ నుంచి ఎదురు చూస్తున్నాం. ఎన్నికల స్టంట్‌లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా 6 వేల పోస్టులు భర్తీకి జగన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న చంద్రబాబు అధికారంలోకి రాగానే భారీ డీఎస్సీని విడుదల చేయడానికి తొలి సంతకం చేయడం సంతోషకరమైన విషయం.

-లక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, నంద్యాల

నిరుద్యోగుల ఆశలు నెరవేరబోతున్నాయి



నిరుద్యోగులు ఎన్నేళ్ళ నుంచో ఎదురు చూస్తున్న డీఎస్సీపై చంద్రబాబు మొదటి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగుల ఆశలు నెరవేరబోతున్నాయి. ఐదేళ్ళ వైసీపీ పాలనలో సచివాలయాల ఉద్యోగాలు తప్పితే జగన్ ప్రభుత్వం చేసిందేమీ లేదు.

-విజయానంద్, డీఎస్సీ అభ్యర్థి, నంద్యాల

చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టి మాట నిలబెట్టుకున్నారు. 16,347 పోస్టులను వదలడం అభినందనీయం. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం సిద్ధపడుతూ వస్తున్నా.. ఎట్టకేలకు మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగుల ఆశలను చిగురింపచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మా కృతజ్ఞతలు.

- చిట్టిబాబు, డీఎస్సీ అభ్యర్థి, ఆదోని

తొలి సంతకం సంతోషకరం



సీఎంగా బాధ్యతలు చేపట్టిన మొదటి సంతకమే చంద్రబాబు మెగా డీఎస్సీపై సంతకం పెట్టడం చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టులు కూడా చాలా తక్కువ ఉన్నాయి. మెగా డీఎస్సీ వల్ల ఉపాధ్యాయులు కావాలన్న కోరిక నెరవేరుతుంది. **- సువర్ణ, ఆదోని**

బొప్పాయి చెట్లను నరికేశారు



గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన బొప్పాయి చెట్లు

మద్దికెర, జూన్ 13: మద్దికెర గ్రామంలోని కవిరెడ్డి వీధిలో నివసిస్తున్న కవిరెడ్డి రామక్రిష్ణ అనే రైతు నాలుగెకరాల తోటను ఎకరాకు రూ.20వేల చొప్పున కౌలుకు తీసుకుని బొప్పాయి చెట్లను సాగు చేశాడు. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెట్లన్నింటినీ నరికవేయడంతో రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లింది. మూడేళ్ల క్రితం రామకృష్ణ మద్దికెర నుంచి కశాపురం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న తోటను కౌలుకు తీసుకొని దాదాపు 2,200 బొప్పాయి మొక్కలను నాటాడు. చెట్లు కాపుకు వచ్చాయి. గుర్తు తెలియని వారు బొప్పాయి చెట్లను నరికేశారని బాధితుడు ఆవేదన చెందాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ గౌడు, ఎన్. లక్ష్మీనారాయణ, రంగయ్య, మాజీ ఎంపీటీసీ డి. శ్రీనివాసులు రైతును కలిసి పరామర్శించారు.

జీడీపీలో 1.6 టీఎంసీల నీరు

ఒక్కరోజులో 1400 క్యూసెక్కుల వరద



ప్రాజెక్టుకు చేరిన వరద నీరు

గోనెగండ్ల, జూన్ 13: గాజులదిన్నె ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షం కురిసిన కారణంగా ప్రాజెక్టులో బుధవారం 1.6 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నాలుగు రోజుల క్రితం 0.7 టీఎంసీలు ఉన్న నీరు రెండు రోజులోనే 1.6 టీఎంసీలకు చేరింది. 1400 క్యూసెక్కుల నీరు ఒక్క రాత్రికే వచ్చి చేరినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇలాగే వరద నీరు వచ్చి చేరితే ప్రాజెక్టుకు ఇబ్బంది కలుగుతుంది. మరమ్మతుల పేరిట క్రస్టు గేట్లను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలివేశారు. దీంతో తీవ్ర ఇబ్బందిగా మారనుంది. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రాజెక్టు దిగువ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు మాత్రమే. అంతకు మించి వరద నీరు వచ్చి చేరితే ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. గత రెండు రోజుల క్రితం నీరు లేక వెలవెలబోయిన ప్రాజెక్టు సోమవారం ఉదయం వరద నీరు వచ్చి చేరడంతో నీటితో కళకళ లాడుతోంది. ప్రాజెక్ట్ కింద 25వేల ఎకరాల సాగు భూమి ఉంది. రెండేళ్లుగా జూన్ చివరి నాటికి ప్రాజెక్టులో వరద నీరు వచ్చి సమృద్ధిగా చేరేది. ఈ ప్రాజెక్టు కింద జీఎన్, పత్తికొండ, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతుంది. దాదాపు 140 గ్రామాలకు తాగునీరు అందుతోంది. ప్రాజెక్టులో వరద నీరు వచ్చి చేరితేనే ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములు పంటలతో కళకళలాడుతాయి.

రూ.4 వేల ఆనందం

- అవ్వా, తాతల కళ్లలో వెలుగు
- ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు మూడో సంతకం
- జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్‌దారులకు ప్రయోజనం

కర్నూలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. అవ్వా తాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు తీపి కబురు అందించారు. గురువారం ముఖ్యమంత్రిగా సామాజిక పింఛన్ రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారు. పెంచిన పింఛన్ జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్‌దారులకు శుభవార్త ఇది. ప్రస్తుతం అందుతున్న పింఛన్‌కు అదనంగా జిల్లాలో రూ.24.49 కోట్ల ప్రయోజనం కలగనుంది. జగన్ ప్రభుత్వం 2019 నుంచి విడతల వారిగా ఐదేళ్లలో రూ.1000 పెంచితే.. చంద్రబాబు ఒక్క సంతకంతో ఏకకాలంలో రూ.1000 పెంచి అవ్వాతాతల మోమున ఆనందం చూశారు. బాబు సంతకంతో పండుటాకుల్లో సంతోషం వెల్లివిరిసింది. మా పెద్ద కొడుకు చల్లగా ఉండాలంటూ చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

సామాజిక భద్రతా పింఛన్ రూ.4వేలకు పెంచుతూ సీఎం చంద్రబాబు మూడో సంతకం చేశాడని తెలియగానే వృద్ధులు, వితంతువులు, వికలాంగుల్లో ఆనందం వెల్లువిరిసింది. పత్తికొండ, కోసిగి తదితర ప్రాంతాల్లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్ద కొడుకుగా చంద్రబాబు చల్లగా ఉండాలని దీవించారు.

రాష్ట్ర విభజనకు ముందు 2014 వరకు సామాజిక పింఛన్ రూ.200 మాత్రమే ఉండేది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఒకేసారి ఐదు రెట్లు పెంచి రూ.1000 చేశారు. ఉమ్మడి జిల్లాలో 4.50 లక్షల మందికి ప్రయోజనం కలిగింది. నెలకు రూ.45 కోట్లు అదనంగా పొందారు. 2019 జనవరిలో సంక్రాంతి కానుకగా మరో రూ.1000 పెంచి రూ.2వేలు చేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే రూ.3వేలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదే క్రమంలో నాటి ప్రతిపక్షనాయకుడు జగన్ కూడా సామాజిక పింఛన్ రూ.3వేలు పెంచుతానని హామీ ఇచ్చారు. జగన్ మాట నమ్మి ఓట్లు వేస్తే.. ఏకకాలంలో రూ.వేయి పెంచకుండా విడతల వారిగా అంటూ మాయ చేసి ఐదేళ్లలో రూ.1000 పెంచి రూ.3వేలు చేశారు.



జిల్లాలో లబ్ధి పొందనున్న సామాజిక పింఛన్‌దారులు	
పింఛన్‌దారులు	పింఛన్లు
వృద్ధులు	1,26,152
వితంతువులు	71,519
దివ్యాంగులు	31,510
చేనేత కార్మికులు	2,948
కల్లుగీత కార్మికులు	242
హిజ్రాలు	241
ఒంటరి మహిళలు	5,883
మత్స్యకార్మికులు	817
డప్పు కళాకారులు	1,457
చర్మకారులు	1,142
కళాకారులు	39
అభయహస్తం	2,572
ఇతరులు	1,145
మొత్తం	**2,45,687**

● ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

సార్వత్రిక 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే.. సామాజిక పింఛన్ రూ.4వేలకు పెంచుతానని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ వరాల్లో, మేనిఫెస్టోలో కూడా దీన్ని భాగం చేశారు. 2014లో రూ.200 నుంచి రూ.1000 పెంచిన చంద్రబాబు 2019లో ఏకంగా రూ.2వేలకు చేశారు. ఆ ఎన్నికల్లో రూ.3వేలు చేస్తానని చెప్పిన జగన్ మోసం చేశాడని గుర్తించిన అవ్వాతాతలు, వితంతవులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు దన్నుగా నిలిచారు. చారిత్రక విజయాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అందించారు. బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.15 గంటలకు అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైన, రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్ పైన చేసిన చంద్రబాబు మూడో సంతకం సామాజిక భద్రతా పింఛన్ రూ.4వేలకు పెంచే ఫైల్‌పై చేశారు. దీని వల్ల జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్‌దారులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. పెంచిన ఈ పింఛన్ ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుంది. అంటే జూలై తారీఖున అవ్వాతాతలు రూ.7వేలు పింఛన్ అందుకోనున్నారు. అంటే జిల్లాలో రూ.97.95 కోట్లు జూలై నెలలో పింఛన్‌దారులకు అదనంగా అందనుంది. అదే క్రమంలో పెంచిన పింఛన్ ప్రకారం ఇప్పుడిస్తున్న రూ.3వేలు కాకుండా అదనంగా రూ.1000 అందనుంది. ఈ ప్రకారం నెలకు రూ.24.49 కోట్లు చొప్పున ఏడాదికి రూ.294 కోట్లు, రాబోయే ఐదేళ్లలో రూ.1,469 కోట్లు అదనంగా ఆర్థిక ప్రయోజనం పింఛన్‌దారులకు అందనుంది.

పెద్దకొడుకులా ఆదుకుంటున్నారు



అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు పెద్ద కొడుకులా వృద్ధులకు పెన్షన్‌లను రూ.4వేలకు పెంచుతూ సంతకం చేయడం ఆనందంగా ఉంది. ఎందరో వృద్ధులకు పెంచిన పెన్షన్ ఆసరాగా ఉంటుంది. చంద్రబాబు చేయనున్న మేలు ఎన్నటికీ మరువలేం.

- కే ఇస్మాయిల్, ఆలూరు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల్లో ఇచ్చిన హామీను చంద్రబాబు నిలబెట్టుకున్నారు. మాలాంటి వయస్సు మళ్లిన వృద్ధులకు పెద్దకొడుకులా అండగా ఉండి, నేనున్నాను.. అంటూ పెన్షన్‌ను రూ.4వేలకు పెంపు చేయడం సంతోషంగా ఉంది.

- గంగమ్మ, ఆలూరు

మా కష్టం తీరుస్తున్నారు



అప్పట్లో రూ.200 ఉన్న పింఛన్‌ను రెండు వేలకు పెంచాడు. మూడు వేలు చేస్తానన్న వైసీపీ ప్రభుత్వం అప్పుడు కొంత ఇప్పుడు కొంత పెంచి చివర్లో మూడు వేలు ఇచ్చింది. నాలుగు వేలు చేస్తానని ఎన్నికల సమయంలో చంద్రన్న మాట ఇవ్వడంతో ఆయనపై నమ్మకంతో ఓటు వేశాం. చంద్రన్న వస్తే ఉన్న పింఛన్ పోతుందని వలంటీర్లు బెదిరించారు. అయినా మేం చంద్రన్నను నమ్మి ఓటువేశాం. ఇప్పుడు చెప్పినట్లే పింఛన్ రూ.4 వేలు చేసి మాట నిలుపుకున్నాడు.

- పక్కీరమ్మ, పత్తికొండ

రక్తదాతలు.. ఆపద్బాంధవులు..

- సహకరిస్తున్న ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్), జూన్ 13:

ఇతరుల ప్రాణాలు నిలిపే అరుదైన అవకాశం రక్తదానం వల్ల కలుగుతుంది. దీన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి జిల్లాలో కొందరు యువకులు సమూహంగా ఏర్పడి రక్తదానం చేస్తున్నారు. ఇతరులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విరివిగా శిబిరాలు ఏర్పాటు చేస్తూ రక్తాన్ని సేకరిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు జిల్లాలో పని చేస్తున్నాయి. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల జీజీహెచ్, శాంతిరాం, విజయ బ్లడ్ బ్యాంకు, నంద్యాల బ్లడ్ సెంటర్, ఉదయానంద బ్లడ్ సెంటర్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు, ఆదోని జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు, కర్నూలు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు, న్యూలైఫ్, విశ్వభారతి హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు, ఆర్ ఆర్, అక్షయ బ్లడ్ బ్యాంకు, విశ్వభారతి పెంచికలపాడు, కర్నూలు బ్లడ్ సెంటర్, కేర్ బ్లడ్ సెంటర్, ఆదోని ఏడీపీ బ్లడ్ సెంటర్, గోవి చారిటబుల్ బ్లడ్ బ్యాంకు, మహాత్మా గాంధీ బ్లడ్ సెంటర్ ఎమ్మిగనూరులో బ్లడ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితో ఉమ్మడి జిల్లాలో 16 సీహెచ్‌సీల్లో బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు ఉన్నాయి.



రక్తదానానికి అర్హతలు ఇవే

- రక్తదాత వయస్సు 18 నుంచి 60 సంవత్సరాలలోపు ఉండాలి
- బరువు 45 కిలోలు ఉండాలి
- నాడి నిమిషానికి 60 నుంచి 100సార్లు కొట్టుకోవాలి
- వంద గ్రాముల రక్తంలో హెచ్‌బీ 12.5 శాతానికి పైగా ఉండాలి
- 3000 ఎంఎల్ మాత్రమే రక్తం సేకరించాలి

ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం



రక్త అవసరాలు తీర్చేందుకు దాతల్లో రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన, చైతన్యం తీసుకువస్తున్నాం. రెడ్‌క్రాస్ ద్వారా కర్నూలు జీజీహెచ్‌లో రక్తం అవసరాలు తీర్చేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా రక్తదాతలను ప్రోత్సహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి ఒక్కరూ బర్త్‌డే, పెళ్లి రోజులు, శుభకార్యాల సందర్భంగా రక్తం ఇవ్వడానికి సిద్ధం కావాలి. అమెరికా, యూరప్ దేశాల్లో అక్కడి ప్రజలు ప్రతి రెండు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుండగా.. మన దేశంలో 3, 4 నెలలకు ఒకసారి ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ఆదోని ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అధికంగా రక్తాన్ని ఇస్తున్నారు. - డా. కేజీ గోవిందరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, కర్నూలు

118 సార్లు రక్తదానం చేస్తున్నా



గత 38 సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నాను. 1987 ఢిల్లీలో ఓ గర్భిణికి సిజేరియన్ ఆపరేషన్ సందర్భంగా మొట్టమొదటి సారిగా రక్తదానం చేశాను. అప్పటి నుంచి ఇప్పటివరు 118 సార్లు రక్తదానం చేశాను. మా అబ్బాయి కోలా అమరగోపాల్ 25వ బర్త్‌డే సందర్భంగా 100వసారి రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో దానం చేశాను.

- కోలా గోపి, ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు, డోన్

తలసీమియా పిల్లలకు రక్తదానం చేస్తున్నా



ఇప్పటి వరకు 25సార్లు రక్తదానం చేశాను. 2014 నుంచి సేవా సమితి ద్వారా రక్తాన్ని అందించగలిగాను. ముఖ్యంగా తలసీమియా పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని ఇస్తున్నా. పసుపుల గ్రామానికి చెందిన ఓ తలసేమియా బాలికకు 22వసారి, ఓ గుండె రోగికి 19వసారి రక్తాన్ని దానం చేశారు.

- సి.రేణుక, యువ భారత్ సేవా సమితి సభ్యురాలు, కర్నూలు

సీపీడబ్ల్యూఎస్ స్కీములకు టెండర్లు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 60 సీపీడబ్ల్యూఎస్ స్కీముల నిర్వహణ, తాగునీటి సరఫరా కోసం కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కాంటాక్టర్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.ఈప్రొక్యూర్‌మెంట్.జీఓవి.ఇన్ లో లాగిన్ ద్వారా ఆన్‌లైన్ టెండరులో పాల్గొనవచ్చన్నారు. టెండర్‌లో పాల్గొనేందుకు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. అదే రోజుసాయంత్రం 4 గంటలకు సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, నంద్యాల డీఆర్ఈఓ పర్యవేక్షణలో ఆన్‌లైన్ టెండర్లను తెరుస్తామని అన్నారు.

యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిలో పురోగతి సాధించండి



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 13: జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపికైన చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్‌ల అభివృద్ధి అంశాలపై పురోగతి సాధించాలని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు సూచించారు. గురువారం ఢిల్లీ నుంచి నిర్వహించిన నీతి అయోగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డా.జి. సృజన తన చాంబర్ నుంచి పాల్గొన్నారు. చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్‌ల డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అభివృద్ధి అంశాలపై నీతి అయోగ్ సీఈవోకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. తదనంతరం చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హొళగుంద బ్లాక్ డెవలప్‌మెంట్‌లకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలను సాచ్యురేషన్ మోడ్‌లో సాధించాలని నీత్ అయోగ్ సీఈవో కలెక్టర్‌కు సూచించారు. కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాల్గొన్న సీపీవో హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీజీ భరత్ మొదటి సారిగా కర్నూలుకు రానున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కాలేజీ వద్ద సాయంత్రం 4 గంటలకు ఘన స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ ఉంటుందని, నగర ప్రజలు, తెలుగుదేశం పార్టీ వార్డు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీ మున్సిపల్ ఆఫీసు, ఎస్‌బీఐ సర్కిల్, గాంధీనగర్, జిల్లా పరిషత్, రాజ్‌విహార్ మీదుగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాగుతుందని తెలిపారు. .

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13: కర్నూలు ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్ డా.బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు కింద ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢి ల్లీలోని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ఆడిటోరియంలో నిర్వహించిన బహుజన రచయితల నాల్గవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఈ పురస్కారం తీసుకున్నారు. 8 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవీఈఓ జమీర్‌పాషా, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆలూరు, జూన్ 13: ఆలూరు మండలం పెద్దహోతూర్ సమీపంలో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడి గొల్ల గుడ్డు లక్ష్మన్న (55) అక్కడిక్కడే మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పెద్దహోతూరు గ్రామం నుంచి ఆటో ఏపీ02టీసీ4393 నెంబర్ గల ఆటో ఆలూరుకు బయలు దేరింది. గ్రామ శివారు వద్ద వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో డ్రైవర్‌తో పాటు గుడ్ల గొల్ల లక్ష్మన్న, సోమ లింగమ్మ, గొల్ల సన్నీ, హనుమంతు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గొల్ల గుడ్డు లక్ష్మన్న (55) అక్కడిక్కడే మృతి చెందాడు. సోమలింగమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మృతుడు గొల్ల గుడ్డు లక్ష్మన్నకు భార్య లక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబులేష్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మిడుతూరు, జూన్ 13: అప్పుల బాధ తట్టుకోలేక పింజరి మహమ్మద్ రఫి(35) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం దేవనూరు గ్రామానికి చెందిన పింజరి మహమ్మద్ రఫి తనకున్న రెండు ఎకరాల పొలంతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని మూడేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. వర్షాలు సకాలంలో కురవక పంట దిగుబడులు సరిగా రాలేదు. పెట్టుబడి కూడా చేతికి అందక కుటుంబ పోషణ భారమై రూ.10 లక్షల అప్పు చేశారు. అప్పులు చెల్లించలేక మనస్తాపనకు గురై మహమ్మద్ రఫి గురువారం తన ఇట్లో పురు గుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రైతు మరణించాడని వైద్యులు తెలపారు. తండ్రి నూర్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.

రైల్వే మహిళా కూలీపై చిరుత దాడి

మహానంది, జూన్ 13: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన పాండవ్ అనే మహిళపై చిరుతపులి దాడి చేసింది. గురువారం నల్లమలలోని గిద్దలూ రు-నంద్యాల రైల్వే ట్రాక్ పరిధిలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు కూలీలు చేస్తుండగా దాడి చేసింది. మిగతా కూలీలు కేకలు వెయ్యడంతో చిరుత పారి పోయింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయాలపాలైన ఆమెను తోటి కూలీలు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి అటవీశాఖ ఉన్నతాధికార్లు చేరుకొని చిరుతపులి కోసం నల్లమలలో అన్వేషించారు.

అన్నీ అసౌకర్యాలే

- విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూస్, సాక్సులు
- వర్షంతో చిత్తడిగా మారిన ప్రాంగణాలు
- ఒక పక్క నిర్మాణ పనులు, మరో పక్క తరగతులు
- బస్తాలు మోస్తూ కూలీలుగా మారిన విద్యార్థులు
- వేసవి సెలవుల తర్వాత మొదలైన పాఠశాలలు



బురదగా మారిన కర్నూలు నగరంలోని టౌన్‌మోడల్ స్కూల్ ప్రాంగణం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13: వేసవి సెలవులనంతరం గురువారం అన్ని యజమాన్యాల పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉరుకులు, పరుగులతో హుషారుగా కనిపించారు. మొదటి రోజు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పలుచగా కనిపించింది. రాత్రి వర్షం పడటంతో పాఠశాలల ఆవరణలు వర్షపునీటితో బురదగా మారాయి. ఒకపక్క పాఠశాలల ప్రాంగణాల్లో అదనపు తరగతి గదుల పనులు జరుగుతున్నాయి. కర్నూలు సీ.క్యాంపు సమీపంలోని నగర పాలక మున్సిపల్ హై స్కూల్‌లో ఈ సన్నివేశం కనిపించింది. ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో కర్నూలు మండల స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఆటోలను తీసుకువచ్చి విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్స్ మోయించారు. 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్ మినహా అన్ని పాఠ్య పుస్తకాలు వచ్చాయి. అలాగే 7వ తరగతి విద్యార్థులకు జనరల్ సైన్స్ తప్ప మిగతా టైటిల్స్ సరఫరా కాలేదు. 6వ తరగతి విద్యార్థులకు 4 టైటిల్స్ పెండింగ్‌లో ఉన్నాయి.



పాఠశాలకు వచ్చిన పుస్తకాలు మోస్తున్న విద్యార్థులు



భవన నిర్మాణాల పనుల వద్ద తిరుగుతున్న విద్యార్థులు





ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు

టయానికి రావాలని తెలియదా?

- ఎమ్మిగనూరు ఏఓపై సీఈఓ ఆగ్రహం
- పరిపాలన అధికారులతో సమీక్షా సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: జిల్లా పరిషత్‌లో సమావేశం ఉందని తెలుసుకుని కూడ టయానికి రావాలని తెలియదా? సమావేశానికి వచ్చావా? లేక ఏదైనా పని ఉండి వచ్చావా? అంటూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఎమ్మిగనూరు పరిపాలన అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ఉందని చెబితే...మధ్యాహ్నం 12.45 గంటలకు ఎలా వస్తావని ఏఓను ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల పరిపాలన అధికారులతో జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ వెంటకసుబ్బారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023-24 మండల పరిషత్ వార్షిక లెక్కలు, లోకల్ ఫండ్ ఆడిట్ అభ్యంతరాలు, ఎంపిటీసీల గౌరవ వేతనం, ఎంపిటీసీల ఖాళీల వివరాలు, 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం, బీపీడీపీ, కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాల గురించి మండలాల వారిగా సమీక్షించారు. వార్షిక లెక్కలను కూడ సమర్పించని ఏఓలను సీఈఓ సున్నితంగా దండించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 14 మండలాలు 15 ఆర్థిక సంఘం నిధులను సరిగ్గా వినియోగించలేదని అన్నారు. నిధులు లేక అల్లాడుతుంటే ఉన్న నిధులను ఎందుకు ఖర్చుచేయలేదని ఏఓలను ప్రశ్నించారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం సకాలంలో ఇవ్వకుంటే ఎంపీడీఓల జీతాల నుంచి రికవరీ చేస్తానని హెచ్చరించారు. ఆడిట్ అభ్యంతరాలపై కొందమంది పరిపాలన అధికారులకు అవగాహన లేదని అన్నారు. ఆడిట్‌కు వచ్చే అభ్యంతరాల పేరాలను త్వరితగతిన జిల్లా పరిషత్ అకౌంట్ సెక్షన్‌లో సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిపాలన అధికారులు సి. మురళీమోహన్‌రెడ్డి, సి. రాంగోపాల్, జితేంద్ర, సరస్వతి, బసవశేఖర్, సౌభాగ్యలక్ష్మి, మండలాల పరిపాలన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ జి. నాసరరెడ్డి

డిగ్రీలో ఆరుగురు డిబారు

కర్నూలు(అర్బన్), జూన్ 13: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2 వ సెమిస్టర్ పరీక్షలో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నంద్యాల, కర్నూలు జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 931 మంది పరీక్షలు రాసేందుకు ధరఖాస్తు చేసుకోగా 780 మంది హాజరయ్యారని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఐదు హామీలపై చంద్రబాబు సంతకం చేయడం పట్ల గౌరు చరిత హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

కల్లూరు, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్రపటానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గురువారం క్షీరాభిషేకం చేశారు. సీఎంగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ప్రజలకు ఇచ్చిన ఐదు హామీలపై నారా చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గౌరు చరిత మాధవీనగర్‌లోని తన స్వగృహంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రధానమైన ఐదు ఫైళ్లపై సీఎం నారా చంద్రబాబునాయుడు సంతకం చేయడం ఆనందంగా ఉందన్నారు. మోగా డీఎస్సీ ల్యాండ్ టైట్లింగ్‌యాక్ట్ రద్దు, పింఛన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్‌పై చంద్రబాబు సంతకాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొలను సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీరాములు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోగా డీఎస్సీ ఫైలుపై సంతకం పట్ల హర్షం: ఏపీ సీఎంగా భాధ్యతలు తీసుకున్న అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మోగా డీఎస్సీ ఫైలుపై తొలి పంతకం చేపడం పట్ల కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌చాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.



సంబరాల్లో టీడీపీ నాయకులు

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎంపీ

కర్నూలు(కలెక్టరేట్)/కర్నూలు(రూరల్): జూన్ 13: కర్నూలు టీడీపీ ఎంపీ బస్తిపాటి నాగరాజు గురువారం కలెక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై కలెక్టర్ ఎస్పీలతో చర్చించారు. కార్యక్రమంలో రామకృష్ణ తదిత రులు ఉన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ నాగరాజు


గూడూరులో భారీ వర్షం

గూడూరు, జూన్ 13: గూడూరులో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ఒక్క సారిగా వాతావరణం చల్లబ డింది. గూడూరు మండలంలో 49.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి వంకలు, వాగులు పొంగి పొర్లాయి.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 13: వైసీపీ ప్రభుత్వంలో రైతుల పాలిట ఉరితాడుగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సంతకం చేయడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు యమపాశంగా తయారైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7.50 లక్షల మంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ యాక్టులో భాగంగా 2020 డిసెంబరులో భూముల సర్వే ప్రక్రియకు రెవెన్యూ యంత్రాంగం రీసర్వే ప్రక్రియ చేపట్టారు. 2023 డిసెంబరు నాటికి 914 రెవెన్యూ గ్రామాల్లో సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి దాకా మూడు విడతల్లో 481 గ్రామాల్లో పూర్తి చేశారు. కర్నూలు జిల్లాలో 247 గ్రామాల్లో సర్వే పూర్తయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మొదటి విడతలో 35 వేలు, రెండో విడతలో 16,050, మూడో విడతలో 18,029 మొత్తం 69,079 మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందజేశారు.

● **ఎన్నెన్నో చిక్కులు.. రైతుల్లో తీవ్ర ఆందోళన:** వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో చాలా మంది రైతులకు 1బీ, అడంగల్ పత్రాలు ఆన్‌లైన్‌లో రావడం లేదు. దీని వల్ల ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో బ్యాంకుల ద్వారా రుణం తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. చాలా మంది రైతులకు భూముల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు ఖరారు చేస్తూ భూహక్కు పత్రాలు జారీ చేశారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో వంద సంవత్సరాల క్రితం నుంచి ఉన్న భూముల విస్తీర్ణాన్ని ప్రస్తుతం ఈ యాక్ట్ కారణంగా భూముల్లో కొంత భాగం కోల్పోవాల్సి రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరో వైపు పాసు పుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫొటోలు ముద్రించడంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. తాము తరతరాల నుంచి పూర్వీకుల ద్వారా సంక్రమించిన పాసు పుస్తకాలపై జగన్ ఫొటో ఉండడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ ఓడిపోవడానికి ప్రధాన కారణం ల్యాండ్ టైటిలింగ్ యాక్టేనని రైతులంతా స్పష్టం చేస్తున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు గురువారం ఈ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంతకం చేయటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



రైతుల పాస్ బుక్‌పై ముద్రించిన జగన్ ఫొటో

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గౌరు చరిత



కలెక్టర్, ఎస్పీ, కమిషనర్‌లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గౌరు చరిత

కల్లూరు, జూన్ 13: పాణ్యం నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కలెక్టర్ జి.సృజన దృష్టికి తెచ్చారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈమేరకు నియోజకవర్గంలో పలు సమస్యలను గౌరు చరిత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పూలబోకే ఇచ్చి ఎస్పీని కలిశారు. పాణ్యం నియోజకవర్గంలో శాంతిభద్రతలపై గౌరుచరిత ఎస్పీతో చర్చించారు. అదేవిధంగా కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజను కూడా కలిశారు. కల్లూరు అర్బన్ 16 వార్డులలో ప్రధానమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరారు.

గౌరు చరితకు అభినందనలు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి తరఫున పాణ్యం నియోజకవర్గంలో పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందిన గౌరు చరితను పలువురు జిల్లా ప్రభుత్వ అధికారులు అభినందనలు తెలిపారు. గురువారం ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి సునీల్‌ఖన్నా గౌరు దంపతులకు పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు ఎంపీని కలిసిన జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి

గూడూరు, జూన్ 13: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ మన్నన్ బాషా కలిశారు. గురువారంకరూలు జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ మన్నన్ బాషా ఎంపీ ని కలిసి శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మా ట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు పార్టీ గుర్తుపెట్టుకొంటుదన్నారు.



నాగరాజుకు బొకే ఇస్తున్న మన్నన్ బాషా

మద్దిలేటి మృతి పార్టీకి తీరని లోటు: టీడీపీ కార్యకర్త కురువ మద్దిలేటి మృతి పార్టీకి తీరని లోటని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మద్దిలేటి మృతదేహానికి ఎంపీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దిలేటి, చిన్న గిడ్డయ్య, చంద్రశేఖర్, మధు, నాగలాపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇక రాష్ట్రంలో స్వర్ణాంధ్ర పాలన

టీఎన్‌టీయూసీ నాయకుల స్వీట్ల పంపిణీ

కోడుమూరు, జూన్ 13: ఇక రాష్ట్రంలో స్వర్ణాంధ్ర పాలన సాగుతుందని టీఎన్‌టీయూసీ నాయకులు గోపాల్‌నాయుడు, బడేసాగౌడ్ అన్నారు. చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కోడుమూరు పట్టణంలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోయి స్వర్ణాంధ్ర పాలన ప్రారంభమైందన్నారు. చంద్రబాబునాయుడు సీఎం బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. అలాగే పింఛన్ రూ.3 వేల నుంచి 4వేలకు పెంచడంతో పాటు అన్న క్యాంటీ న్లను ప్రారంభించాలని సంతకాలు చేడయం హర్షించ దగ్గ విషయం అన్నారు. అలాగే ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేస్తూ మరో సంతకం చేయడం వలన ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలరాం, హనుమంతప్ప, బ్రిటీష్‌రాముడు, బాలకిట్టు, పాల్గొన్నారు.

ప్యాలకుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు చంద్ర మౌళి, కర్ల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్ర బాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిసారని అన్నారు. ఏపీకి రాజధాని అమరావతే ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యూసూ ఫ్, శేఖర్, వెంకటేశ్వర్లు, తులసిరెడ్డి పాల్గొన్నారు.



మిఠాయి పంచుతున్న నాయకులు

జీవనశైలితో క్యాన్సర్ నివారణ

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 13: ఆరోగ్యకరమైన జీవన శైలితో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో వైద్యసిబ్బంది స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ వ్యాయమం లేకపోవడం, మద్యం సేవించడం, ధూమపానం వంటి అలవాట్లు వల్ల క్యాన్సర్ వస్తుందని హెచ్చరించారు. ఏటా కోటి మందికి పైగా క్యాన్సర్‌తో మరణిస్తున్నారని, క్యాన్సర్ వచ్చినప్పుడు బరువు తగ్గే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్ కృష్ణప్రకాష్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఏఆర్ఎంవో డా. వెంకటరమణ, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.హేమలత, స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్రరెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డా.శివ బాల, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాజువాల్టీలో ఇన్ఫెక్షన్ తగ్గించాలి: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాజువాల్టీ, ఏఎంసీల్లో ఇన్ఫెక్షన్‌ను బాగా తగ్గించాలని టీబీ ముక్త్ భారత్ స్టేట్ కో ఆర్డినేటర్ డా. నీరద ఆదేశించారు. గురువారం టీబీ ముక్త్ భారత్ బృందం కర్నూలు జీజీహెచ్‌లో తనిఖీ చేశారు. వైద్యసిబ్బందితో ఇన్‌ఫెక్షన్ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో క్యాజువాల్టీ, ఏఎంసీ, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్, ల్యాబ్, ఏఆర్‌టీ సెంటర్, టీబీ విభాగం, ఈఎన్‌టీ, లేబర్ రూమ్, మెడికల్ ఓపీలను పరిశీలించారు. నర్సులు ఇన్‌ఫెక్షన్ నివారణ పద్ధతులు అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డితో ఇన్‌ఫెక్షన్ నివారణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా. వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా. శివబాల, డా. కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వో

జగన్.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో

కర్నూలు(అర్బన్), జూన్ 13: తప్పు చేసిన ఎవరినీ ప్రజలు వదలి పెట్టరని, వైసీపీ నాయకుడు జగన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా చంద్రబాబును చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని జగన్ ఐదేళ్ల కాలంలో సర్వనాశనం చేసి, వ్యవస్థలను ధ్వంసం చేశారని, ఆయనకు ఇక మాట్లాడే అర్హత లేదన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఓర్వకల్లు, జూన్ 13: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై సోమయాజులపల్లె ఘాట్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలేరో డ్రైవర్ మృతి చెందాడు. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి బొలేరో వాహనం అతివేగంగా అతి జాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ఉన్న డ్రైవర్ మంజు (30) మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణలో అన్ని వర్గాలకు సమ న్యాయం

కర్నూలు(రూరల్), జూన్ 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న పేర్కొన్నారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో గురువారం లక్ష్మన్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అరాచకంగా పాలించినందుకే ప్రజలు ఆ పార్టీకి ప్రతి పక్ష హోదా లేకుండా చేశారని ఆయన విమర్శించారు.

పత్తి ఓబులయ్యకు రాజబాబు స్మారక అవార్డు

కర్నూలు(కల్చరల్), జూన్ 13: దివంగత తెలుగు చలన చిత్ర నటుడు రాజబాబు పేరున నెలకొల్పిన రాజబాబు స్మారక అవార్డును సాహిత్యం, నాటక రంగం విభాగంలో కర్నూలుకు చెందిన నంది అవార్డు గ్రహీత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యకు ప్రదానం చేశారు. గురువారం రాత్రి హైదరాబాదు ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిత్ర దర్శకుడు బి. గోపాల్, ప్రసన్నకుమార్‌ల తోపాటు సినీ నిర్మాత మోహన్‌దాస్ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని పత్తి ఓబులయ్య అందుకున్నారు. సినీ నటులు అన్నపూర్ణ, క్రిష్ణవేణి, ఏపీ నాటక అకాడమీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 13: నగరంలోని గడియారం ఆసుపత్రిలోని ప్రిమెట్రిక్ మైనార్టీ బాలికల వసతి గృహాల ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా.సునీల్ కన్నన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్‌లో 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థినులు దరఖాస్తుతోపాటు మూడు పాసు పోర్టు సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కుల ఆదాయ ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జతప రచాలని తెలిపారు. వివరాలకు 9491653323 ను సంప్రదించాలని సూచించారు.

కర్నూలు ఎంపీకి వేద ఆశీర్వాదం

కర్నూలు(కల్చరల్), జూన్ 13: ఎన్‌డీఏ కూటమిలో కర్నూలు టీడీపీ ఎంపీగా అఖండ మెజారిటీతో గెలిచిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేశారు. గురువారం నగరంలోని ఎంపీ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు, దుశాలువతో సత్కరించి వేద ఆశీర్వచనాలు పలికారు. కల్లే చంద్రశేఖర్, కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

టీజీ భరత్‌తో యువతకు ఉపాధి అవకాశాలు

కర్నూలు(కల్చరల్), జూన్ 13: కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కర్నూలు నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరుతాయని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు సముద్రాల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం నగరంలోని కోట్ల సర్కిల్ వద్ద గల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ ప్రతినిధులు సమావే శంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, సాధికార సమితి సభ్యులు డార్వాడ ఆనందరావు, శ్రీహరి శర్మ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థులందరికీ సీట్లు కేటాయించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 13: కర్నూలు జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద విద్యార్థికి సీట్లు కేటాయించాలని జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవికి ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ గురువారం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కరువు కాటకాలతో తమ పిల్లలను తల్లిదండ్రులు చదివించుకోలేక ఇతర ప్రాంతాలకు వలసలకు తమ వెంట తీసుకెళ్తున్నారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు అఖిల్, రాహుల్, రమేష్, సుంకన్న, కళ్యాణ్ ఉన్నారు.

మంత్రి పవన్‌ను కలిసిన సురేష్‌బాబు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: జనసేన అధినేత, రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్‌ను ఆ పార్టీ కర్నూలు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం మంగళగిరిలో కేంద్ర కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని సురేష్‌బాబు అన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాదేండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

సమితి ఆవిర్భావ దినోత్సవానికి తరలి రావాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: లంబాడీ హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాస్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం నేషనల్ గోర్ బంజారా సమ్మేళన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజార జాతి ప్రతినిధులతో జూలై 1న హైదరాబాదులో సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

బక్రీద్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 13: ఈ నెల 17న జరిగే బక్రీదు పండుగకు నగరంలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ అధికారులను ఆదేశించారు. గురువారం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యానికి అవసరమైన నీటిని సరఫరా చేయాలన్నారు. వాటి కోసం ట్రాక్టర్లను అందుబాటులోకి తీసుకోవాలన్నారు. జంతు వ్యర్థాలు సేకరించడానికి బ్యాగుల సరఫరా చేయాలన్నారు. అవసరమైన చోట్ల షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అధికారులు, ఉద్యోగులు కమిషనర్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.విశ్వేశ్వరరెడ్డి, ఈఈ షాకీర్, సీఐ ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 13: సార్వత్రిక ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ జి.సృజనకు విన్నవించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేసిన సందర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ హృదయరాజు, జిల్లా కార్యదర్శి జవహర్, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాశన్న, రామక్రిష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మంత్రి టీజీ భరత్‌కు బీసీ సంఘాల స్వాగతం

కర్నూలు(అర్బన్), జూన్ 13: రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను జిల్లా బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలుతామని నాయకులు టీజీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం బీసీ భవన్‌లో ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సుంకేసుల సెయింట్ జోసెఫ్ కళాశాల నుండి గాంధీనగర్, రాజవిహార్, జిల్లా పరిషత్, బుధవారపేట, మీదుగా గాయంత్రి ఎస్టేట్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకుంటారని పేర్కొన్నారు. బీసీ సంఘాల నాయకులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు, టీజీ అభిమానులు తరలిరావాలని కోరారు.

న్యాయవాదుల హర్షం

కర్నూలు(లీగల్), జూన్ 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడంపై స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రజల ఆస్తులకు భంగం ఏర్పడిందని చంద్రబాబు తన రెండో సంతకంతో ఈ చట్టం రద్దు చేయడంతో రాష్ట్ర ప్రజలకు తమ ఆస్తులపై భరోసా ఏర్పడిందని అన్నారు.

చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు, జూన్ 13: బనగానపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేంద్ర (32) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రాజేంద్ర కర్నూలు కృష్ణానగర్‌లో నివాసముంటూ బనగానపల్లెలో విధులు నిర్వహిస్తున్నాడు. గత కొద్ది కాలంగా ఈయన అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. రెండెకరాల పొలం కొనుగోలు చేసి అందులో పంటలు సాగు చేయగా నష్టం వచ్చింది. అలాగే కర్నూలులో పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం స్టడీ హాల్ నిర్వహించాడు. అందులో కూడా నష్టం రావడంతో అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. ఈయనకు భార్య, కొడుకు కూతురు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి కూడా. భార్య డెలివరీ కోసం పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆయన గత నెల 16వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని భార్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో బంధువులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆయను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి సవితకు కురువ సంఘం శుభాకాంక్షలు

ఆదోని/మద్దికెర, జూన్ 13: అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచిన కురువ సామాజిక వర్గానికి చెందిన, నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సవితకు కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు శుభాక్షలు తెలిపారు. గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు మాన్వి దేవేంద్రప్ప మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు వచ్చేలా చూడాలని కోరారు. కురువ కులస్తులైన గొర్రెల కాపరులకు ఉచితంగా గొర్రెలకు ఇన్సూరెన్స్ చెల్లించే విధంగా చూడాలన్నారు. టీడీపీ నాయకులు గోపాల్, నాగరాజు, గర్జప్ప, బీరప్ప, రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కురువలకు టీడీపీలోనే సముచిత న్యాయం

రాజకీయంగా వెనుకబడిన కురువ కులస్థులకు టీడీపీ సముచిత న్యాయం కల్పించిందని కురువ సంఘం సాధికారికత కన్వీనర్ ఎస్.లక్ష్మినారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, నాయకులు ఎస్.ఉదయ్ కుమార్, ఎస్.చంద్రమోహన్ అన్నారు. వారు మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ బస్తిపాటి నాగరాజుకు ఎంపీ , పెనుగొండ ఎమ్మెల్యే సవితకు మంత్రి పదవి ఇచ్చి న్యాయం చేశారన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడండి

ఆదోని, జూన్ 13: పచ్చని గ్రామాల్లో చిచ్చు పెట్టే నాయుకలను ఇంటికి పంపారని, ఇకముందైన బుద్ధి తెచ్చుకొని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. గురువారం ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తల పై రెచ్చగొట్టే వ్యాఖలు చేస్తుండటం ఏమిటని ప్రశించారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, కార్యకర్తలు రెచ్చిపోవద్దని టీడీపీ కార్యకర్తలకు సూచించారు. టీడీపీ సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, బుద్దారెడ్డి, సత్తిరెడ్డి, వీరేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి

మద్దికెర, జూన్ 13: మండలంలో ఖరీఫ్ విత్తన సమయం ఆసన్నమైందని, విత్తన ప్రక్రియ సందర్భంగా రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆశాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలన్నారు. రైతులతో సమావేశమై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని ఆదేశించారు. వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, కవిత, రాణి, తదితరులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

మద్దికెర, జూన్ 13: మండలంలోని మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. గురువారం ప్రభుత్వం మంజూరు చేసిన స్టూడెంట్స్ కిట్స్ పుస్తకాలను స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. రెండు విడతల్లో 13వేల పుస్తకాలు వచ్చాయని తెలిపారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలతో పాటు బ్యాగులు, షూస్ కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఈవో-2 గోపాల్, కస్తూర్బా ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన విట్టా రమేష్

ఆదోని టౌన్, జూన్ 13: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీజేపీ కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జి విట్టా రమేష్ గురువారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్డీఏ ఉమ్మడి కూటమి తరుపున బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి విజయం సాధించడం పై ఆయన ప్రశంసించారని విట్టా రమేష్ తెలిపారు.

టీడీపీతోనే ఆర్యవైశ్యులకు న్యాయం

మద్దికెర/ఆలూరు, జూన్ 13: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే ఆర్యవైశ్యులకు న్యాయం జరుగుతుందని సంఘం నాయకులు సుంకు రవీంద్రబాబు, ముత్యాల రాజశేఖర్ శెట్టి అన్నారు. గురువారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్‌కు మంత్రి పదవి ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో కూడా ఆర్యవైశ్య సంఘం నాయకులకు జిల్లా అధ్యక్ష పదవులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవులు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. సంఘం నాయకులు సుదర్శన్ శెట్టి, మీసేవా సతీష్, పవన్ తదితరులు ఉన్నారు.

మంత్రి టీజీ దృష్టికి ఆలూరు సమస్యలు

రాష్ట్ర మంత్రిగా నియమితులైన టీజీ భరత్‌ను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపినట్లు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్; జ్యోతి దంపతులు తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

కర్నూలు ఎంపీకి సమస్యల వినతి

తుగ్గలి, జూన్ 13: మండలంలోని పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి తిమ్మయ్య చౌదరి అన్నారు. గురువారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తుగ్గలి మండలంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసి ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేలా చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ తాలుకా రైతు సంఘం నాయకులు బాలన్న ఉన్నారు.

ఆదోని బీజేపీ నాయకులకు పురంధేశ్వరి అభినందనలు

ఆదోని టౌన్, జూన్ 13: అసెంబ్లీ ఎన్నికలలో ఆదోని నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పార్థసారధి మంచి మెజారిటీతో విజయం సాధించడంలో కీలకంగా వ్యవహరించిన స్థానిక పార్టీ నాయకులను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి అభినందించారు. అసెంబ్లీ ఎన్నికల తీరుపై చర్చించడానికి స్థానిక నాయకులతో గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. కేవలం 28 రోజుల ప్రచారంతో విజయకేతనం ఎగరవేడయం పార్టీకు గర్వకారణమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారని నాయకులు తెలిపారు. బీజేపీ కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జి విట్టా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్

కౌతాళం, జూన్ 14: మండల పరిధిలోని కరణి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు భీమరెడ్డి, శేషయ్య, ఉమేష్, మహేష్ గురువారం తెలిపారు. పల్లెపండుగ సందర్భంగా గ్రామంలో పెద్దల సహకారంతో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నిలో పాల్గొనే జట్టు రూ.600 ఎంట్రీ ఫీజు ఉంటుందని, ఇందులో విజేతగా మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11,116, ద్విస్థానం జట్టుకు రూ.7,116, తృతీయ స్థానం జట్టుకు రూ.3,116 బహుమతి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 19 తేదీలోపు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఇవ్వాల్సిన చిక్కీలు నేలపాలు

కోసిగి, జూన్ 13: ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారంలో భాగంగా చిక్కీలు అందజేసేవారు. డి.బెళగల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చిక్కీలు చెత్త కుప్పలోకి కనిపించాయి. గురువారం బడులు తెరవడంతో విద్యార్థులకు అందించాల్సిన చిక్కీలను పాఠశాల ఆవరణంలోని చిక్కీలను కుప్పగా మూలన పడేశారు. అవి చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు ఇవ్వకుండా ఇలా మూలన పడేయమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై జిల్లా, మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డి.బెళగల్ గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





బడిగంట మోగింది..

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 13: వేసవి సెలవులు 49 రోజుల తర్వాత గురువారం బడి గంట మోగింది. విద్యార్థులు బడిబాట పట్టారు. విద్యార్థులతో మళ్లీ పాఠశాలల్లో సందడి నెలకొంది. మొదటి రోజు కావడంతో చాలా రోజుల తర్వాత తోటి స్నేహితులు కలవడంతో విద్యార్థులు కబుర్లు చెప్పుకుంటూ.. ఉపాధ్యాయులు చెప్పే విశేషాలు వింటూ గడిపేశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు పాఠశాలల్లో అంతంత మాత్రమే హాజరయ్యారు. ప్రైవేటు పాఠశాలలో తమ పిల్లలు చేర్పించేందుకు తల్లిదండ్రులు పరుగులు తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆయా తరగతుల్లో చేర్పించేందుకు తలిదండ్రులు తమ పిల్లలతో పాటు బడులకు వచ్చారు. మొదటిరోజు కావడంతో కొన్ని చోట్ల పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు అందించారు.

కాడెద్దులు తామై...



ఆస్పరి, జూన్ 13: కాడెద్దుకు తామేమి తక్కువ కాదన్నట్లుగా రైతు దంపతులు రెండు ఎకరాలు పొలంలో దంతె వేసి.. అవురా అనిపించుకున్నారు. మండలంలోని కలపరి గ్రామానికి చెందిన ధర్మ సూరి, మహాలక్ష్మీ ఒక ఎకరా వచ్చి మిరప, ఒక ఎకర చోళకాయి పంటలు సాగు చేశారు. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పంటలలో కలుపు మొక్కల నివారణకు తామే కాడెద్దులుగా మారి గురువారం దంతే లాగారు. విత్తు చేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు సేద్యాలకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు బాడుగలు ఉండడంతో పెట్టుబడి భారమై భరించలేక ఇలా తామే దంతెను లాగుతున్నట్లు వారు తెలిపారు. రైతన్నకి వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వ రాయితీపై అందించాలని వారు కోరారు.

అయోమయం

- గెలిచినా వైసీపీ క్యాడర్‌లో కనిపించని ఉత్సాహం
- 'పార్టీలో ఉందామా... జంప్ అవుదామా'
- పేరుకే ఎమ్మెల్యే... పవర్ లేకపాయె
- అయోమయంలో వైసీపీ శ్రేణులు

ఆలూరు, జూన్ 13: రాష్ట్రంలో టీడీపీ ప్రభజనం సృష్టించినా, స్వల్ప మెజారిటీతో ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి విరుపాక్షి గెలుపొందినా... క్యాడర్‌లో స్తబ్ధత నెలకొంది.. ఎక్కడా ఉత్సాహం, సంబరాలు కనిపించలేదు... టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకులు డీలా పడిపోయారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఓవర్ యాక్షన్ చేసిన నాయకులు, ఇప్పుడు సైలెంట్ అయిపోయారు. వాట్సాప్ గ్రూప్‌లో, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టే బ్యాచ్‌లు కనుమరుగై పోయారు. ఎమ్మెల్యేగా గెలిచినా, మన పనులు జరగవు అని, ఇప్పుడు ఎలా...?? అంటూ కొందరు ఆలోచనలో పడ్డారు. టీడీపీ నాయకులతో సాన్నిహిత్యం ఉన్న వారి ద్వారా టీడీపీలో చేరేందుకు సిద్ధం అవుతున్నారు. డీలర్ షిప్‌లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో పార్ట్ టైం ఉద్యోగాలు ఎక్కడ పోతాయో అని, వాటిని కాపాడుకునేందుకు పార్టీ మరుదామా ప్రధాన క్యాడర్ ఆలోచనలో పడ్డినట్లు సమాచారం. అయితే, వైసీపీ గెలుపు కోసం పని చేసిన వాళ్ళు ఇప్పుడు అధికారంలోకి వచ్చాం కదా అని టీడీపీలోకి చేరాలని చూస్తే తామెందుకు ఒప్పుకుంటామని టీడీపీ నాయకులు అంటున్నారు. మరో వైపు ఇదే నియోజకవర్గానికి చెందిన గుమ్మనూరు జయరాం గుంతకల్‌లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ప్రభావం కూడా ఆలూరు నియోజకవర్గంపై ఉండటంతో కొందరు వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ నాయకుల రెడ్‌బుక్ ఉందని గుమ్మనూర్ జయరాం అనుచరులు చెబుతుండటంతో, వైసీపీ నాయకులో టెన్షన్ మొదలైంది. దీంతో వైసీపీ శ్రేణుల్లో గెలిచినా ఆనందం కరువైంది.



పాఠశాలకు తాళాలు

- రెగ్యులర్ టీచర్లను నియమించాలని డిమాండ్

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 13: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో రెగ్యులర్ టీచర్లను నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాలకు తాళాలు వేశారు. అక్కడ తాత్కాలిక ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గురుస్వామిని పాఠశాల నుంచి బయటకు పంపి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ సంవత్సరం నుంచి ఎంపీపీఎస్ పాఠశాలలో రెగ్యులర్ టీచర్స్ లేక 90 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన రెగ్యులర్ టీచర్లు ప్రమోషన్ మీద బదిలీ అయ్యారని, అప్పటినుంచి ఇప్పటివరకు ఒక్క రెగ్యులర్ టీచర్‌ని నియమించలేదని పేర్కొన్నారు. "ఐదవ తరగతి అయిపోయిన విద్యార్థులకు ముందు తరగతులకు వెళ్లడానికి టీసీ కావాలి.... ఆ టీసీలపైన రెగ్యులర్ టీచర్స్ సంతకం ఉండాలి... కానీ, ఈ పాఠశాలలో రెగ్యులర్ టీచర్ లేరు.. సంతకాలు చేయడానికి ఏ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార"ని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ సమస్య పైన గ్రామస్థులంతా ఐక్యంగా జిల్లా విద్యాధికారులకు, మండల విద్యాధికారులకు విన్నవించామని, ఎన్నో నిరసనలు తెలిపామని, అయినా ఎలాంటి స్పందన లేదని తల్లిదండ్రులు వాపోయారు. ఇకనైనా విద్యాధికారులు దీనిని దృష్టిలో ఉంచుకొని గార్లదిన్నె గ్రామం ఎంపీపీఎస్ పాఠశాలకు రెగ్యులర్ టీచర్లను నియమించి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్ గారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్, దావీదు, రాజన్న, ప్రతాప్, దేవిపుత్ర హుసేని, దినేష్ పాల్గొన్నారు.



పాఠశాలకు తాళాలు వేసిన దృశ్యం

కోళ్ల ఫారం భవనం కబ్జా

ఆదోని రూరల్, జూన్ 13 : పక్క ఫొటోలో కనిపిస్తున్నది ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కోళ్లఫారం నిర్వహించుకోవడానికి నిర్వాహకులకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనం. ఈ భవనాన్ని వైసీపీ నాయకుల అండదండలతో ఆ పార్టీ కార్యకర్త సొంతం చేసుకొని దర్జాగా అందులో కాపురం పె ట్టాడు. అలాగే ఆ భవనానికి పొజిషన్ పట్టా కూడా పుట్టించారు. ఈ తంతు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే ఆదోని మండలం మదిరె గ్రామంలో ప్రభుత్వం కొద్ది సంవత్సరాల క్రితం ఎస్సీల స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కోళ్ల ఫారం ఏర్పాటు చేసింది. అందుకు ఒక భవనాన్ని నిర్మించింది. క్రమేపీ కోళ్ల ఫారం ఆగిపోయింది. కానీ, ప్రభుత్వం నిర్మించిన భవనం ఉండి పోయింది. ఈ భవనంపై వైసీపీ నాయకుల కన్ను పడింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి అనుచరుడైన వైసీపీ కార్యకర్త కర్ణి హంపయ్య ఆ భవనాన్ని కబ్జా చేసి అందులో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ మధ్య కాలంలోనే వైసీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి ఆ గ్రామ ఉప సర్పంచు కావడంతో తన కార్యకర్త కబ్జా చేసిన కోళ్ల ఫారం భవనానికి కొళాయి కనెక్షన్ కూడా ఇచ్చాడు. దీంతోపాటు కబ్జా చేసిన ఆ భవనానికి పొజిషన్ పట్టా కూడా ఇప్పించారు వైసీపీ నాయకులు. భవనాన్ని కబ్జా చేసిన సదరు కర్ణి హంపయ్యకు ఇళ్లు ఉన్నాయని, తక్షణమే అధికారులు ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





వైసీపీ నాయకులు సృష్టించిన పొజిషన్ పట్టా , కబ్జాకు గురైన కోళ్ల ఫారం భవనం

భారీ వర్షానికి కోతకు గురైన రోడ్లు

కోసిగి, జూన్ 13 : వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురై ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. మండల పరిధిలోని పెద్దభోంపల్లి-ఐరంగల్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు భారీ వర్షానికి కోతకు గురైంది. కల్వర్టు దగ్గర రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అలాగే దేవరబెట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కల్వర్టు రోడ్డు మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు కోతకు గురైన రోడ్లను మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



భారీ వర్షానికి కోతకు గురైన పెద్దభోంపల్లి-ఐరంగల్ ప్రధాన రోడ్డు



పెద్దభోంపల్లి-ఐరంగల్ గ్రామాల మధ్య కొట్టుకుపోయిన కల్వర్టు రోడు





కోతకు గురైన దేవరబెట్ట వెళ్లే కల్వర్టు

కన్నుల పండుగగా పునీత ఆంథోని పండుగ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ పాస్టర్లు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 13: కతోలికక గురువు పునీత ఆంథోని పండుగ గురువారం స్థానిక ఆర్‌సీఎం అనాథ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ డైరెక్టర్ కరస్పాండెంట్ ఫాదర్ రెవరెండ్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా కర్నూలు పాస్ట్రల్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలరాజు, ప్రధాన గురువు రెవరెండ్ ఫాదర్ ఆవుల జాన్ దేవదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునీత ఆంథోని అద్భుతాలు కలిగిన వ్యక్తిగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారన్నారు. ఆయన పేరుతో ఆదోనిలో పాఠశాల, ఆశ్రమం ఉండడం గొప్ప విషయం అన్నారు. మధ్యాహ్నం భక్తులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నందికొట్కూరు విచారణ గురువు ఫాదర్ లోక్‌దశ్ బాలయేసు, గల్లెల విజయ్ కుమార్, రామదుర్గం విచారణ గురువు ఫాదర్ జోసెఫ్ కుమార్‌తో పాటు 16 మంది గురువులు పాల్గొన్నారు.

ఆర్డీటీతో పేదలకు చేయూత

దేవనకొండ, జూన్ 13 : ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆర్డీటీ చేయుతనిస్తుందని తెర్నేకల్ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం నాగరాణి అన్నారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా చదువుల పండుగ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎంని సన్మానించారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, సమ దుస్తులను అందజేనున్నట్లు ఆర్డీటీ సభ్యులు సుగుణ, సుకృతమ్మ, ఎస్తేరమ్మ, మణిక్యమ్మ తెలిపారు.

జనసేన కార్యకర్తల బైక్ ర్యాలీ

ఎమ్మిగనూరు టౌన్/ఆదోని, జూన్ 13 : ఆంధ్రప్రదేశ్ లో కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం జనసేన నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమప్ప సర్కిల్‌లో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చిత్ర పటానికీ పాలాభిషేకం చేసి టపాసులు పెల్చి సంబరాలు జరుపుకున్నారు, జనసేన నాయకులు బీసీ నాగరాజు, పుల్లన్న, రామకృష్ణ, ప్రసాద్, కొండయ్య, ఈశ్వర్, భరత్ పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన మల్లప్ప

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను గురువారం విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో ఆదోని జనసేన పార్టీ నాయకుడు మల్లప్ప కలిసి అభినందనలు తెలిపారు. పవన్‌కళ్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశామని మల్లప్ప తెలిపారు.

ముగతి ఆదర్శ పాఠశాకు దరఖాస్తుల ఆహ్వానం

నందవరం, జూన్ 13: ముగతి గ్రామంలో మండల మోడల్ స్కూల్ ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 7లో 1, 8లో 12, 9వ తరగతిలో 2 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, 21న పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో సంతకాల సేకరణ

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 13: 2024 నీట్ పరీక్ష పరీక్ష నిర్వాహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ప్రవేట్ కళాశాల విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు జాకీర్, సాయితేజ, కుమార్, హర్ష పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ

కౌతాళం, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మండలంలోని 13 జడ్పీ, 6 ప్రాథమికోన్నత, 39 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి చెందిన పాఠ్యపుస్తకాలు ఎంఈఓ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. మండల విద్యాధికారిణి శోభారాణి టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజులతో కలసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై సీఎం సంతకం

ఆదోని, జూన్ 13: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు రెండవ సంతకం పెట్టడం అభినందనీయమని ఆదోని బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ పై సంతకంతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఆదోనిలో మూడేళ్లుగా కోర్టు భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని, ముఖ్యమంత్రి చొరవ చూపాలని కోరారు. కోర్టు అద్దె భవనంలో కొనసాగుతున్నామని, భవన నిర్మాణ పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శాప్‌నెట్ ఛైర్మన్ పదవికి రాజీనామా

ఎమ్మిగనూరు, జూన్13: శాప్‌నెట్ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాచాని వెంకటేష్ రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం శాప్‌నెట్ సీఈఓ, సెక్రటరీ-ఐటీ, ఈఅండ్‌సీ శాఖకు రాజీనామ పత్రాన్ని పంపినట్లు ఆయన తెలిపారు.

ఉడిపి తేజావర్ మఠం పీఠాధిపతికి ఘన స్వాగతం

మంత్రాలయం, జూన్ 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఉడిపి తేజావర్ మఠం పీఠాధిపతి శ్రీవిశ్వప్రసన్నతీర్థుల స్వామీజీకి శ్రీమఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గురువారం మఠం జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, వెంకటేశ్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్‌లు పూలమాలలు వేసి ముఖద్వారం నుంచి వేద పండితు ఘనస్వాగతం పలికారు.